నందిగామలో వ్యక్తి ఆత్మహత్య

రాజాపూర్, ఫిబ్రవరి 6: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేతిరెడ్డిపల్లి చెన్నయ్య(45) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నయ్య డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పిల్లల చదువు నిమిత్తం జడ్చర్లలో ఉంటున్నారు. భార్యా పిల్లలు జడ్చర్లలో ఉండగా, సోమవారం ముదిరెడ్డిపల్లికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తలుపులు తీయకపోవడంతో గ్రామస్థులు పగులగొట్టి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. అనంతరం భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

కల సాకారమయ్యేనా?

గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి

- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయించని కేంద్రం
- కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంజూరవుతాయనే ఆశలు
- పాత అలైన్‌మెంట్‌ను కూడా పూర్తి చేసేందుకు ప్రయత్నాలు
- ఈ ప్రాంతంలో రైలు మార్గం వస్తే వ్యాపారపరంగా అభివృద్ధి



వనపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వనపర్తి, నాగర్‌కర్నూల్ ప్రజల చిరకాల కోరిక అయిన గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తయ్యింది. కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం గద్వాల- మాచర్ల రైల్వేలైన్‌కు బదులుగా అలైన్‌మెంట్ మార్చి, గద్వాల- డోర్నకల్ రైల్వేలైన్ ఏర్పాటుకు ఫైనల్ లొకేషన్ సర్వే చేయాలని ఆదేశించింది. ఈ మేరకు సర్వే కోసం రూ.7.40 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఆ సర్వే పూర్తికాగా, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తారని ఆశించారు. కానీ ఆమోదం లభించలేదు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కావడంతో.. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఈ లైన్‌కు కేంద్రం నిధులు మంజూరు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇప్పటికే రైల్వే లైన్ అందుబాటులో ఉంది. మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాల మీదుగా ఈ లైన్ వెళ్తోంది. మొన్నటివరకు సింగిల్ లైన్‌గా, డీజిల్ లోకోమోటివ్‌లు నడిచేలా ఉండగా.. దాన్ని మహబూబ్‌నగర్ వరకు డబుల్ లైన్ చేయడంతోపాటు ఎలక్ట్రిఫికేషన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వనపర్తి జిల్లా మీదుగా రైల్వేలైన్ వెళ్తున్నప్పటికీ.. అది మదనాపూర్, ఆత్మకూరు మండలాలకే పరిమితంగా ఉంది. అక్కడ సాధారణ రైళ్లు మినహా అక్కడ ఎక్స్‌ప్రెస్‌లు ఆగే పరిస్థితి లేదు. పేరుకు వనపర్తి రోడ్ రైల్వేస్టేషన్‌గా నామకరణం చేసినప్పటికీ.. వనపర్తి జిల్లా కేంద్రానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో స్టేషన్ ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి వనపర్తికి రైల్వేలైన్ సాధన కోసం ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు. మొదట రాయచూర్- మాచర్ల వరకు రైల్వేలైన్ వేయాలని ప్రతిపాదనలు చేశారు. 12 ఆగస్టు 2002 సంవత్సరంలో అప్పటి కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ చేతులమీదుగా రాయచూర్- గద్వాల వరకు రైల్వే లైన్‌కు శంకుస్థాపన చేశారు. ఆ లైన్ అందుబాటులోకి వచ్చి ఎలక్ట్రిఫికేషన్ కూడా పూర్తయ్యింది. ఆ తర్వాత ఉద్యమాలు జరిగినా గద్వాల నుంచి మాచర్ల వరకు రైల్వేలైన్‌కు ఆమోదం రాలేదు. గత సంవత్సరం అలైన్‌మెంట్ మార్చి.. కొత్త లైన్‌కు ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించగా అది పూర్తయ్యింది.

కొత్త అలైన్‌మెంట్ ఇదే..

రాయచూర్ నుంచి గద్వాల జంక్షన్ వరకు రైల్వేలైన్ పనులు పూర్తి కాగా.. ప్రస్తుతం రైళ్లు నడుస్తున్నాయి. గద్వాల నుంచి ఆరేపల్లి వరకు 7.8 కిలో మీటర్ల మేర ప్రస్తుతం లైన్ ఉంది. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం అక్కడి నుంచి భత్యూరు, కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, నాంపల్లి, నల్గొండ, భీమవరం, సూర్యాపేట, మోతె, పాలేరు, కుసుమంచి మీదుగా డోర్నకల్ వరకు వెళ్తుంది. మొత్తం 296 కిలోమీటర్ల మేర రైలు మార్గం నిర్మించాల్సి వస్తుందని, ఇందుకు రూ.5,330 కోట్లు అంచనా వ్యయం అవుతుందని ప్రతిపాదించారు. దీనివల్ల పారిశ్రామికంగా అత్యంత వెనుకబాటులో ఉన్న వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలు అభివృద్ధి అవుతాయి. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు రైలుమార్గం ఏర్పడి.. దూరభారం తగ్గడంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు సులభంగా రైలులో ప్రయాణం చేసే అవకాశం లభిస్తుంది. పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే.. ఆరేపల్లి నుంచి కడుకుంట్ల, వనపర్తి, గోపాల్‌పేట, సల్కార్‌పేట, నాగర్‌కర్నూల్, ఇంద్రకల్లు, తోటపల్లి, కల్వకుర్తి, వంగూరు, కందుకూరు, దేవరకొండ, మల్లేపల్లి, పెద్ద అడిశర్లపల్లి, చలకుర్తి, తిరుమలగిరి, నెల్లికల్, విజయపురి, కొత్తూరు మీదుగా కృష్ణానదిని దాటుకుని పాత గుంటూరు జిల్లా.. ప్రస్తుతం పాల్నాడు జిల్లా పరిధిలోని మాచర్లకు చేరుకోవాలి. ఆ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఎక్కువగా ఉండటంతో రవాణా సులభతరం అవుతుందని అంచనా వేశారు. కానీ కొత్త అలైన్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉమ్మడి జిల్లాలో పాత అలైన్‌మెంట్‌లో ఉన్న కల్వకుర్తి వరకు రైలుమార్గం నిర్మాణం జరుగుతుంది. అక్కడి నుంచి వంగూరువైపు కాకుండా నాంపల్లి మీదుగా నల్గొండకు కొత్త అలైన్‌మెంట్ ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేశారు.

పాత అలైన్‌మెంట్ కోసమూ ప్రయత్నాలు..

ప్రస్తుతం ఆమోదం తెలిపిన అలైన్‌మెంట్‌లో కల్వకుర్తి వరకు రైలుమార్గం ఏర్పాటవుతుందని ప్రతిపాదించినప్పటికీ.. కీలకమైన నల్లమల ప్రాంతంతోపాటు సిమెంట్ ఫ్యాక్టరీలు అధికంగా ఉన్న ప్రాంతానికి రైలుమార్గం ఏర్పాటు కావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కొత్త అలైన్‌మెంట్‌లో ఎలాగూ కల్వకుర్తి వరకు రైలుమార్గం ఏర్పాటు కానుండటంతో పాత అలైన్‌మెంట్ అంటే కల్వకుర్తి నుంచి వంగూరు మీదుగా మాచర్ల వరకు వెళ్లాల్సిన దూరాన్ని 126 కిలోమీటర్లుగా నిర్ణయించి.. ఆ మేరకు కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. త్వరలో ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్‌రెడ్డి పాత అలైన్‌మెంట్‌లో ఉండి, కొత్త అలైన్‌మెంట్ పరిధిలోకి రాని 126 కిలోమీటర్ల దూరానికి కూడా ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేసి నిధులు ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులతో కొద్దిరోజుల క్రితం భేటీ అయ్యారు. గతంలో ఈ రైల్వేలైన్ పూర్తి చేయడానికి కావాల్సిన నిధుల్లో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటన చేశారు. కానీ ఆ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం రైల్వేలైన్ నిర్మాణానికి కావాల్సిన రూ.5,330 కోట్ల ఖర్చును 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించనుంది. గతంలో 51 శాతం కేంద్రం, 49 శాతం రాష్ట్రం భరించాలనే నిబంధన ఉన్నప్పటికీ.. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒక్క భూసేకరణ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చేయించాల్సి ఉంటుంది. ఈ రెండు అలైన్‌మెంట్లకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం సానుకూలంగానే ఉండగా.. వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా? లేక ఇంకొన్నాళ్లు ఎదురుచూడాల్సి వస్తుందా? అనేది తేలాల్సి ఉంది. గద్వాల- మాచర్ల రైల్వేలైన్‌ను ప్రతిపాదించిన మొదట్లో పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్) పద్ధతిలో సుమారు రూ.1,000 కోట్లు అవుతాయని అంచనా వేయగా.. ప్రస్తుతం అలైన్‌మెంట్ మార్చాక రూ.5,330 కోట్లకు వెళ్లింది. ఇంకా అలస్యం చేస్తే నిధుల ఖర్చు తడిసిమోపెడవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.





గద్వాల మండలం వీరాపురంలో రోడ్లపై పారుతున్న మురుగు నీరు



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో మురుగు కాల్వను శుభ్రం చేస్తున్న కార్మికుడు

పారిశుధ్యంపై.. స్పెషల్ డ్రైవ్

- పల్లెల్లో నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు నిర్వహణ
- ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం తొలి టాస్క్
- తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు

మహబూబ్‌నగర్/గద్వాల, ఫిబ్రవరి 6: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించింది. తమ పదవీకాలం ముగియడానికి ముందే సర్పంచ్‌లు గ్రామాల పర్యవేక్షణను వదిలేశారు. దీంతో చాలా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నెల ఏడో తేదీ గురువారం నుంచి 14 వరకు ఎనిమిది రోజుల పాటు పల్లెల్లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించింది. కలెక్టర్లు దీనిపై అధికారులకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు.

చేపట్టాల్సిన పనులు ఇవీ..

గ్రామాల్లో రోజూ రహదారులను శుభ్రం చేయాలి. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలి. మురుగు కాలువల్లో నీరు నిలవకుండా శుభ్రం చేయించాలి. చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించాలి. పబ్లిక్ ప్రదేశాలైన స్కూల్, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్స్, మార్కెట్ ప్రాంతాలు, బస్ స్టాప్‌లను శుభ్రంగా ఉంచుకోవాలి. ఖాళీ ప్లాట్లను శుభ్రం చేయించి, పాడుబడ్డ పాత భవనాలను తొలగించాలి. నీరు నిల్వకుండా చూడాలి. నీరు నిల్వ ఉన్నచోట వాటర్‌బాల్స్ దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వాలు వదలాలి. ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలి. తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి. తాగునీటి పైప్‌లు లీకేజీ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలి. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలి.

15న గ్రామ సభలు

స్పెషల్ డ్రైవ్ పూర్తయిన తర్వాత ఈనెల 15న కలెక్టర్లు గ్రామ సభలు నిర్వహిస్తారు. ఈ సభలో సామాజిక రుగ్మతలు మద్యం తాగడం, గుట్కా, నార్కోటిక్స్‌పై యువతకు సందేశం ఇవ్వాలి. చాలా మంది యువత మద్యానికి, మత్తు పదార్థాలకు అలవాటు పడుతుండటంతో వాటి బారి నుంచి కాపాడేందుకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యంతో అధికారులు విధిగా పాల్గొనాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉండి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి

ఉమ్మడి జిల్లాలో 1,640 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక పాలనలో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం అధికారులపై మరిన్ని బాధ్యతలను పెట్టింది. వేసవి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి కేటాయించింది.

నిధులు లేకుండా నిర్వహణ ఎలా?

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి వారం పాటు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో నిధులు లేకుండా పనులు ఎలా చేయాలని ప్రత్యేక అధికారులు పెదవి విరుస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇప్పటి వరకు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి, కార్యక్రమాలను విజయవంతం చేశారు. వారి పాలన ముగిసి, గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ ఖాతాల్లో అక్కడక్కడ నిధులు ఉన్నా.. వాటిని డ్రా చేసే పరిస్థితి లేదు. ఖాతాలకు ప్రభుత్వం తాళం వేసింది. దీంతో కార్యక్రమాలను ఎలా నిర్వహించాలనే సందిగ్ధంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కనుల పండువగా

రథోత్సవం

- తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాదిగా భక్తుల రాక
- మారుమోగిన అంజన్న నామస్మరణ



రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, ఫిబ్రవరి 6: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున రథోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ప్రకాశం, గుంటూరు, కర్నూల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. దాంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలు మారుమోగాయి. పూజల అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాల మధ్య తీసుకొచ్చి పూలతో అలంకరించిన రథంలో ఉంచారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో ఊర్కొండ ఎస్ఐ లెనిన్, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య శాఖ హెల్త్ క్యాంపు నిర్వహించింది. ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు భక్తులకు వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఈశ్వరమ్మ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తూడి అనిల్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యచంద్రారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి పూజలు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మంగళవారం స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, పాలక మండలి సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, నాయకులు బృంగి ఆనంద్ కుమార్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ కూడా స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పాలక మండలి సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్. నాయకులు పెద్దయ్య యాదవ్, అరవింద్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, రాజేందర్‌గౌడ్ ఉన్నారు.

లేబర్ హక్కులు అమలు చేయాలి

- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : లేబర్ హక్కులు అమలు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ఆయా మండలాల్లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికుల వివరాలు సేకరించాలని, మధ్య వర్తుల వివరాలను అందించాలని జిల్లా కార్మిక శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం ఇటుక బట్టీల వివరాలు, పని చేస్తున్న కార్మికుల వివరాలను తనకు ఇవ్వాలని, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి పని చేస్తున్న జిల్లాలోని కార్మికుల వివరాలను సేకరించాలన్నారు. సబ్ డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయాలని, పత్తి పొలాల్లో బాల కార్మికులు పని చేస్తున్నారా? అన్న అంశంపై వ్యవసాయ అధికారితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, ఎస్పీ యోగేష్ గౌతమ్, డీఎస్పీలు పాల్గొన్నారు.

అన్ని వసతులు కల్పించాలి

జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతనంగా నిర్మిస్తున్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. నూతన ఆసుపత్రి భవనంలోని రెండో అంతస్తులో 50 మంది విద్యార్థులతో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి ప్రారంభించేందుకు కావల్సిన తరగతి గదులు, ప్రిన్సిపాల్, ఉపన్యాసకుల గదులు, లైబ్రెరి, ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల నిర్వహణకు కావల్సిన అడ్మిన్ బ్లాక్, అనాటమీ డిపార్ట్‌మెంట్, ఫిజియాలజి, ల్యాబ్‌లు, గదులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో సంబంధిత అధికారులతో మెడికల్ కళాశాల ఏర్పాటు, నిర్వహణ, వసతి సౌకర్యాలపై సమీక్షించారు. వైద్య ఆరోగ్యశాఖ డీఎంఈ శివప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్, ఈఈ జైపాల్‌రెడ్డి, డీఈ కృష్ణమూర్తి, ఏఈ సాయి పాల్గొన్నారు.

గృహహింస కేసులో ఆరేళ్ల జైలు శిక్ష

వీపనగండ్ల, ఫిబ్రవరి 6: గృహహింస కేసులో ఓ వ్యక్తికి మంగళవారం కోర్టు రూ.రెండు వేల జరిమానాతో పాటు, ఆరు సంవత్సరాల జైలుశిక్ష విధించినట్లు వనపర్తి ఎస్పీ రక్షిత కె.మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీపనగండ్ల గ్రామానికి చెందిన దయపు శివ రోజూ తాగి వచ్చి భార్య శివమ్మను చిత్రహింసలకు గురి చేసేవాడు. భర్త వేధింపులు తాళలేక శివమ్మ 2019 సెప్టెంబరు 26న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. శివమ్మ మరణ వాంగ్మూలం మేరకు ఎస్ఐ వహీద్‌అలీబేగ్ కేసు నమోదు చేశారు. 306, 498-ఎ ఐపీసీ ప్రకారం చార్జిషీటును ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టులో వేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ 17 మంది సాక్షులను న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టారు. భర్త శివపై నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయాధికారి రజిత ఆరు సంవత్సరాల జైలుశిక్షతో పాటు, రూ.రెండు వేల జరిమానా విధించినట్లు ఎస్పీ వివరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



మద్యం, నిందితులతో పోలీసులు

గట్టు, ఫిబ్రవరి 6: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు పోలీసులు మంగళవారం కర్ణాటక మద్యాన్ని పట్టుకొని, కేసు నమోదు చేశారు. గట్టు ఎస్ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని ఎరిగేర, లింగస్‌ఖాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన సుదర్శన్, రాజు గౌడ్, నరేష్‌గౌడ్ ఎరిగేరలో గల వందన బార్ అండ్ రెస్టారెంట్‌కు చెందిన వెంకటేష్ ఆదేశాలతో కర్ణాటక మద్యాన్ని ఆంధ్రకు కారులో తరలిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున బల్గెర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాన్ని ఆపి, తనిఖీ చేశారు. కారులో 20 కాటన్ల మద్యం లభించింది. వాటిని పరిశీలించగా.. అది కర్ణాటక లిక్కర్‌గా గుర్తించారు. కారును స్వాధీనం చేసుకొని మద్యాన్ని తరలిస్తున్న ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్యం విలువ రూ.76,800 ఉంటుందని చెప్పారు. ముగ్గురితో పాటు, వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మందుబాబులకు జైలుశిక్ష

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 6 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుమంది మందుబాబులకు జైలుశిక్ష పడినట్లు అలంపూర్ ఎస్సై నాగరాజు తెలిపారు.

ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో జరిగిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన షేక్ ఎక్బాల్‌కు రెండురోజులు, నాగరాజుకు మూడురోజులు, కావేటి జ్ఞానేంద్రుడుకు వారంరోజులు, కాలువల బాలకృష్ణకు మూడురోజులు, మద్దిలేటికి నాలుగురోజుల చొప్పున జైలుశిక్ష విధించడంతో పాటు, ఒక్కొక్కరికి రూ.రెండు వేల జరిమానా వేసినట్లు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఎస్సై వాహనదారులను కోరారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



పర్వీన్‌సుల్తానా(ఫైల్)

మక్తల్, ఫిబ్రవరి 6 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూర్ మండల కేంద్రానికి చెందిన పర్వీన్‌సుల్తానా(22)ను నర్వ మండలం పాతర్‌చెడ్‌కు చెందిన కలీంపాషతో రెండు సంవ త్సరాల క్రితం వివాహం జరిపించారు. కాగా వీరి కుటుంబం మక్తల్ పట్టణంలోని రహెమానియా కాలనీలో నివాసం ఉంటున్నారు. కలీంపాష నర్వలో టైలరింగ్ చేస్తూ ప్రతీనిత్యం మక్తల్ నుంచి నర్వకు వెళ్లి వస్తుంటాడు. మంగళవారం భర్త, కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో పర్వీన్‌సుల్తానా ఇంట్లో ఉయ్యాల కొండికి ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఏడు నెలల కుమారుడు ఉన్నాడు. కాగా, తన కుమార్తెను అదనపు కట్నం కోసం భర్త, వారి కుటుంబ సభ్యులు వేధించారని మృతురాలి తల్లి జుబేదాబేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కోస్గి రూరల్, ఫిబ్రవరి 6 : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం జెక్కి తండాకు చెందిన బద్యానాయక్(50) గుండుమాల్ గ్రామ శివారులోని ఇటుకల బట్టీ వద్ద పనిచేస్తు ఇక్కడే జీవనం సాగిస్తున్నాడు. భక్తిమళ్లకు చెందిన అంజిలయ్యతో కలిసి బద్యానాయక్ మంగళవారం బైక్‌పై గుండుమాల్ వెళ్లి తిరిగి భక్తిమళ్ల వైపు వస్తుండగా గుండుమాల్ శివారులో మద్దూర్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. గమనించిన స్థానికులు కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బద్యానాయక్ మృతి చెందాడు. తీవ్ర గాయాల పాలైన అంజిలయ్యను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. బద్యానాయక్ భార్య దస్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, ఫిబ్రవరి 6 : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జడ్చర్ల రైల్వేస్టేషన్ పరిధి ఆలూరు రైల్వేగేటు సమీపంలో చోటు చేసుకుంది.

మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల పట్టణంలోని ఆలూరుకు వెళ్లే దారిలోని కాలనీకి చెందిన ముస్లిం ఫకీర్ యూసుఫ్(34) మంగళవారం ఉదయం ఆలూరు రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా యూసుఫ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపారు.

మరో ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

జడ్చర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే రైలు మార్గంలో జడ్చర్ల-గొల్లపల్లి మధ్య దారిలో గుర్తు తెలియని వ్యక్తి(45) రైలు కింద పడి మృతి చెందినట్లు మహబూబ్‌నగర్ రైల్వే ఎస్సై సయ్యద్‌అక్బర్ తెలిపారు. మృతుడి కుడి చేయి మోచేతి వరకు మాత్రమే ఉందని, రైలులో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించే వ్యక్తిగా తెలిసిందని వివరించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

కూటమితో దేశానికి ఒరిగేదేమీ లేదు

- బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే నోటాకు వేసినట్లే
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

కందనూలు, ఫిబ్రవరి 6 : ఇండియా కూటమితో దేశానికి ఒరిగేదేమీ లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమితో దేశానికి ఒరిగేదేమీ లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ అవినీతి అక్రమాలకు పాల్పడిందని, ఆ పార్టీకి ఓటేస్తే నోటాకు వేసినట్లేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్‌పై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్న మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలంతా మోదీ వైపు చూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ నాయకుడు తల్లోజు ఆచారి, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జి దిలీపాచారి, కట్ట సుధాకర్‌రెడ్డి, దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, దళిత సంఘం నాయకుడు మాన్య నాయక్, బీజేపీ పదాధికారులు, కన్వీనర్లు, ఆయా జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

గౌడ కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లి కృష్ణారావుకు పూలబొకే అందజేస్తున్న గౌడ సంఘం నేతలు

కొల్లాపూర్, ఫిబ్రవరి 6 : గౌడ కులస్తుల సంక్షేమానికి సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌ఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గౌడ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం విస్మరించిందని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కులవృత్తిని ఆధారంగా చేసుకుని ఉన్న గౌడ కులస్తులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు తనవంతు తోడ్పాటునందిస్తానని భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈత, తాటి వనాల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. గీత కార్మికులకు సబ్సిడీలో పనిముట్లు, ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు గోవిందు గౌడ్, రామన్‌గౌడ్, కౌన్సిలర్లు శ్రీదేవిగౌతంగౌడ్, మాజీ సర్పంచ్ హైమావతిగౌడ్, వంగ రాజశేఖర్ గౌడ్, కిరణ్‌తేజ, రామన్‌గౌడ్, సి.గోవిందుగౌడ్, రమేష్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, యాదన్నగౌడ్, సుదర్శన్‌గౌడ్, మాచర్ల రామకృష్ణగౌడ్, వెంకటస్వామి గౌడ్, పెంట్లవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ సువర్ణమ్మ, బాలస్వామిగౌడ్, దగడాల సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం రూ.10 కోట్లు

కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.పది కోట్లు కేటాయించారని, ఆ డబ్బునంతా పేద విద్యార్థుల చదువుల కోసం వినియోగిస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడంతో సభలో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. తనను కలిసేందుకు వచ్చేవారు ఎవరైనా సరే పూలబొకేలు, శాలువాలు తీసుకురావద్దని దానికి ఖర్చయ్యే డబ్బును తాను ఏర్పాటుచేసిన విద్యానిధికి విరాళాలుగా ఇస్తే అందరం కలిసి నిరుపేద విద్యార్థులకు విద్యాదానం చేద్దామని, వారికి ఉజ్వల భవిష్యత్తును అందిద్దామని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. విద్యాదానంపై మంత్రి జూపల్లి కృష్ణారావు అంకితభావం పట్ల నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అతిథి అధ్యాపకుల కోసం
దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 6 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించుటకు అతిథి అధ్యాపకులు ఈనెల ఎనిమిదవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసి ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆమె పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు కళాశాల పనివేళల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

వాహనం బోల్తా

- నేల పాలైన రసాయన మందులు



భూత్పూర్ వద్ద వాహనం బోల్తా పడడంతో నేలపాలైన రసాయన మందులు

భూత్పూర్, ఫిబ్రవరి 6 : అదుపు తప్పి వాహనం బోల్తా పడడంతో రూ.లక్షలు విలువ చేసే రసాయన మందులు నేల పాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన పదిమంది రైతులు తమ వ్యవసాయానికి సంబంధించిన క్రిమిసంహారక మందులను హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసి గ్రామానికి తీసుకెళ్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున వీరు ప్రయాణిస్తున్న వాహనం భూత్పూర్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రైతులకు స్వల్ప గాయాలు కాగా, రసాయన మందులు అన్నీ రోడ్డు పక్కన కాలువలో పడి మొత్తం నేల పాలయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని రైతులు తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

పంట పొలాల్లో నాగుపాము పట్టివేత



వరి పంట పొలంలో నాగుపామును బంధించిన కృష్ణసాగర్

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 6 : వనపర్తి జిల్లా పరిధిలోని చిట్యాల గ్రామ శివారులో మంగళవారం వరి పంట పొలాల్లో స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్ నాగుపామును బంధించారు. చిట్యాల శివారులోని శ్రీచైతన్య స్కూల్ సమీపాన ఉన్న ఎస్ఎస్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో ఉన్న మెకానిక్ షాపులో రఫీక్ మెకానిక్ పని చేసుకుంటు ఉండగా ఆకస్మాత్తుగా షాపులోకి పెద్ద నాగుపాము వచ్చింది. ఒక్కసారిగా తీవ్ర భయానికి గురైన రఫీక్ షాపులో ఉన్న సహచర మెకానిక్‌ల సహకారంతో బయటికి వచ్చారు. పాము మెల్లగా పక్కనే ఉన్న వరి మడిల్లోకి వెళ్లింది. సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా పామున్న ప్రదేశానికి చేరుకుని వెంటనే చాకచక్యంగా నాగుపామును బంధించారు.

నిజాయతీని చాటుకున్న వ్యక్తులు

- దొరికిన బంగారు ఆభరణాల బ్యాగ్ పోలీసులకు అప్పగింత
- వారి ద్వారా బాధితులకు అందజేత



బంగారు ఆభరణాల బ్యాగ్‌ను పోలీసులకు అప్పగిస్తున్న వ్యక్తులు

మద్దూర్, ఫిబ్రవరి 6 : నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని దోరేపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు నిజాయతీని చాటుకున్నారు. ఏఎస్పీ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోస్గి పట్టణానికి చెందిన షాహీన్‌బేగం భర్త ఇబ్రహీంతో కలిసి కోస్గి నుంచి ద్విచక్ర వాహనంపై పుట్టినిల్లయిన దామరగిద్ద మండలం గడిమున్కన్‌పల్లికి వెళ్తున్న క్రమంలో మద్దూర్ మండల పరిధిలోని దోరేపల్లి వద్ద ద్విచక్ర వాహనానికి కట్టిన బ్యాగ్ పడిపోయింది. ఆ మార్గంలో వెళ్తున్న దోరేపల్లికి చెందిన చోటెమియా, సుతారి శివరాజ్‌కు దొరికింది. బ్యాగ్‌ను వారు మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బ్యాగులో ఎనిమిది తులాల విలువైన బంగారు ఆభరణాలు, రూ.500 నగదు, ఆధార్‌కార్డు ఉంది. ఆధార్‌కార్డు ఆధారంగా బాధితులను గుర్తించి వారికప్పగించినట్లు ఏఎస్పీ వివరించారు. నిజాయతీని చాటుకున్న ఛోటేమియా, శివరాజ్‌లను పోలీసులు అభినందించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గద్వాల టౌన్, ఫిబ్రవరి 6 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్ర సమీపంలోని ఏడవ వార్డు పరిధి దౌదర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డిని సోమవారం రాత్రి డీఈవో సస్పెండ్ చేసినట్లు మంగళవారం తెలిసింది. కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై దీర్ఘకాల సెలవులో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి తిరిగి ఇటీవలే విధుల్లో చేరారు. విధుల్లో కొనసాగుతున్నప్పటికీ తరచుగా పాఠశాలకు గైర్హాజరవుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అపూర్వచౌహాన్ సోమవారం మధ్యాహ్నం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయ హాజరు రిజిస్టర్‌లో సంతకం ఉన్నప్పటికీ పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడాన్ని గుర్తించిన అదనపు కలెక్టర్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రైలు ప్రయాణికులపై దాడి

- రైలు దిగి వస్తున్న వారి నుంచి సెల్‌ఫోన్, నగదు చోరీ చేస్తున్న యువకులు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 6 : కొందరు యువకులు రైలు ఎక్కడానికి వస్తున్న ప్రయాణికులను టార్గెట్ చేస్తూ వారిని దోపిడీ చేయడం, అడ్డువచ్చిన ప్రయాణికులను దాడి చేసి గాయపరుస్తున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ముళ్లపొదల సమీపంలో కొందరు యువకులు వాహనాలతో వచ్చి అక్కడే నిలబడుతున్నారు. మంగళవారం అర్ధరాత్రి రైలు దిగి ప్రయాణికులు నడుచుకుంటు వెళ్తుండగా కొందరు యువకులు అమాంతం వారిపై దాడి చేసి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదును చోరీ చేసి తాము తెచ్చుకున్న బైక్‌లపై ఉడాయించారు. అలాగే, మంగళవారం తెల్లవారుజామున వెంకటాద్రి రైలుకు వస్తున్న ప్రయాణికులను ముళ్లపొదల సమీపంలో చీకటిగా ఉన్న ప్రాంతంలో మాటు వేసి ప్రయాణికులపై ఒక్కసారిగా పడి వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదును లాక్కున్నారు. ఇదే క్రమంలో ఓ ప్రయాణికుడు డబ్బులు ఇవ్వకుండా రాయితో దాడి చేసి గాయపర్చగా పక్కన ఉన్న మిగితా ప్రయాణికులు చోరీ చేసేందుకు వచ్చిన వారిపై రాళ్లను విసిరారు. దీంతో దుండగులు పరారయ్యారని ప్రయాణికులు 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. కొందరు ప్రయాణికులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు యువకుల కోసం గాలిస్తున్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 6 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు నాగర్‌కర్నూల్ ఎస్సై గోవర్ధన్ మంగళవారం తెలిపారు. తమకందిన సమాచారం మేరకు కొల్లాపూర్ చౌరస్తాలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

ఇసుకను తరలిస్తున్న వారిపై కేసు నమోదు

గండీడ్, ఫిబ్రవరి 6 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం రంగారెడ్డిపల్లి, కప్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం ఉదయం ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లల్లో ఇసుకను తరలిస్తుండగా బీట్ డ్యూటీ కానిస్టేబుల్ పట్టుకొని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల యాజమానులు రంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాటూరి మల్లయ్య, కప్లాపూర్ గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డిలపై, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పార్కు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి



పార్కును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : నారాయణపేట 6వ వార్డు బీసీ కాలనీలో రూ.మూడు కోట్లతో చేపట్టిన పార్కు పనులను అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్యానికి పార్కులు ఎంతగానో తోడ్పడుతాయని, త్వరలో పార్కు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆయన కమిషనర్‌ను ఆదేశించారు.

పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు..

ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేయాలని, చెత్త తొలగింపు, ఫాగింగ్ చేపట్టాలని, మొక్కలకు నీరు పోయాలని, డ్రై డే తదితర కార్యక్రమాలను రోజు వారిగా ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం



దాసరి కొండప్పను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మద్దూర్, ఫిబ్రవరి 6 : పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను 2002-03 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. తమ వంతుగా రూ.5,101 ఆర్థిక సాయం అందించారు. కళను గుర్తించి పద్మశ్రీ అవార్డు అందించడం అభినందనీయం అన్నారు.

దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

కోస్గి రూరల్, ఫిబ్రవరి 6 : జిల్లా విద్యాశాఖ వారు ప్రచురించిన నిలువు రాళ్ల అనే మాస పత్రిక ప్రచురణకు అవసరమైన ఆర్థిక సహాయం అందించిన కోస్గి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డిని మంగళవారం జిల్లా విద్యాశాఖ తరపున సన్మానించారు. కోస్గి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాలువాతో సన్మానించిన వారు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ మాస పత్రికను పంపారు. దాత రఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలకు ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి విద్యాసాగర్, సిబ్బంది శ్రీనివాస్, డీఆర్పీ వీర మల్లేష్ పాల్గొన్నారు.

నిలువు రాళ్ల మాస పత్రిక విడుదల

కృష్ణ, ఫిబ్రవరి 6 : మండలంలోని ముడుమాల్ గ్రామ శివారులో కృష్ణానది ఒడ్డున వెలసిన ఆది మానవులు నిలువు రాళ్ల వద్ద డీఈవో వెంకటయ్య నిలువు రాళ్ల విద్యా మాస పత్రి మంగళవారం విడుదల చేశారు. ప్రభుత్వం నిలువు రాళ్లను పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నిజాముద్దిన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, డి.శేఖర్, శ్రీనివాస్‌రావు, ఈరన్న, ఆశప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




మాట్లాడుతున్న అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్

మక్తల్, ఫిబ్రవరి 6 : ఈనెల 16న జరుగు దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో వీవోఏలు పాల్గొంటారని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ గోవిందరాజులు అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎంకు సమ్మె నోటీసు అందించి, మాట్లాడారు. వీవోఏలకు రూ.26 వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు పరిచి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాంరెడ్డి, లోకేష్, వెంకట్రాములు, వసంత, వీఓఏలు పాల్గొన్నారు.

● నారాయణపేట టౌన్ : ఈనెల 16న జరిగే పారిశ్రామిక బంద్, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాము, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడారు. రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ బంద్ ఉంటుందన్నారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. టీ ప్రగతి శీల రైతు సంఘం యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం సలీం, భగవంతు, ప్రశాంత్, రైతు సంఘం చెన్నారెడ్డి, రాము, బాలప్ప, అశోక్ పాల్గొన్నారు.

బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలి



కోస్గి శివాజీ చౌరస్తాలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్/ఊట్కూర్/కోస్గి, ఫిబ్రవరి 6 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ మంగళవారం మక్తల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్క సుమన్ వాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి బాల్క సుమన్‌కు లేదని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయిదే బాల్క సుమన్ చెప్పుదెబ్బలు తినడం ఖాయం అన్నారు. కాంగ్రెస్ నాయకులు వల్లంపల్లి లక్ష్మణ్, వాకిటి శ్యామ్, బోయ వెంకటేష్, ఫయాజ్, నాగేష్, రఘు, సురేందర్‌గౌడ్, రహెమాన్ పాల్గొన్నారు. అదే విధంగా ఊట్కూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కోస్గి పట్టణంలోని శివాజీ చౌరస్తాలో బాల్క సుమన్ చిత్ర పటానికి చెప్పుల దండ వేసి దహనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చెప్పు చూయించే దమ్ము ఎక్కడిదన్నారు. ఊట్కూర్‌లో నాయకులు మోహన్‌రెడ్డి, లింగం, సలీం, అంజాద్, రవి, అశోక్, వెంకటేష్‌గౌడ్, అంజప్ప, సాజిత్, సంజప్ప, కేశవులు, నాగేష్‌గౌడ్, మహేష్, శివ పాల్గొనగా, కోస్గిలో వార్ల విజయ్‌కుమార్, అన్నకిష్టప్ప, సీసీ వెంకటయ్య, రఘువర్ధన్‌రెడ్డి, తుడుం శ్రీనివాస్, బెజ్జు రాములు, నాగులపల్లి శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సలీం, హాజీ, టెంట్ నర్సిములు, భానునాయక్, మాస్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

▸ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ▸ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



మక్తల్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/నర్వ/కృష్ణ, ఫిబ్రవరి 6 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి, పేద ప్రజలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 151మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందించారు. అదే విధంగా నర్వ మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ మల్‌రెడ్డి ఆధ్వర్యంలో 73 మంది లబ్ధిదారులకు, కృష్ణ మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. మలి విడత కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో తులం బంగారం అదనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ సాయం పెంచడం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేశామన్నారు. అతిత్వరలో మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, తహసీల్దార్ సువర్ణరాజు, ఆర్ఐ భూపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, బోయ రవి, శివశంకర్‌రెడ్డి, కృష్ణ, కురుమయ్య, నర్వలో ఎంపీపీ జయరాములు శెట్టి, ఆర్ఐ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య సాగర్, ఎంపీటీసీ సభ్యుడు నీరజ్, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వివేకవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శరణప్ప, అయ్యన్న, అంజనేయులు గౌడ్, కృష్ణలో ఎంపీపీ పూర్ణిమ, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, ఎంపీడీవో యశోద, ఆర్ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మినీ రేషన్ షాపు ప్రారంభం

మాగనూరు : మండలంలోని ఓబులాపూర్‌లో మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మినీ రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓబులాపురం గ్రామ పంచాయతీగా ఏర్పడినా అడవి సత్యారం రేషన్‌షాపు డీలర్ పరిధిలో రెండు గ్రామాలు ఉన్నాయని ఒకటి పేగడబండ, రెండోది ఓబులాపురం ఉన్నాయన్నారు. ఓబులాపురం నుంచి అడవిసత్యారం దాదాపు పది కిలో మీటర్ల వెళ్లి రేషన్ తీసుకునేందుకు ఇబ్బంది పడటంతో ఇక్కడే మినీ రేషన్‌షాపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన హోటల్ శేఖరప్ప అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ శ్యామలమ్మ, జడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, మాజీ సర్పంచు నారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్ఐ శ్రీశైలం, శివరాంరెడ్డి, రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యంపై దృష్టి సారించాలి

▸ ఎస్పీ యోగేష్ గౌతమ్



మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట, ఫిబ్రవరి 6 : జీవిత లక్ష్యంపై విద్యార్థులు దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. మంగళవారం నారాయణపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోలీస్ కళా బృందం, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గోల్‌ను ఏర్పాటు చేసుకొని అందుకగుణంగా ముందుకు సాగాలని, లక్ష్యాన్ని చేరుకునేందుకు వచ్చే ఇక్కట్లను అధిగమిస్తూ ముందుకెళ్లాలన్నారు. ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ టీమ్స్, ప్రతీ స్కూల్‌లో ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేశామని, ఎలాంటి ఫిర్యాదులనైనా బాక్సులో వేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కళాశాల, పాఠశాలలకు వచ్చిపోయే సమయంలో ఆకతాయిలు వేధిస్తే వెంటనే డయల్ 100 లేదా జిల్లా షీ టీంకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ బాలికలను కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకు సేవలు, రుణాలు, యాప్స్ వాట్సాప్, ట్విట్టర్ తదితర వాటితో అప్రమత్తంగా ఉండాలన్నారు. బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు. అంతకుముందు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏఐటీయూసీ రూపొందించిన డైరీని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎస్పీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ రంగారెడ్డి, పోలీస్ కళా బృందం సురేందర్, శేఖర్, లింగన్న, కల్యాణి, షీ టీం పోలీసులు శ్రీదేవి, బాల్‌రాజ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న, శ్రీనివాస్, వెంకటేష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పూర్తికి కృషి

జిల్లాలో కోర్టు అధికారుల సమన్వయంతో పనిచేసి పెండింగ్ కేసులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర డీజీపీ రవి గుప్తా మంగళవారం ఎస్పీలు, కమిషనర్లతో వీసీ నిర్వహించి, సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతి భద్రతలు పరిరక్షించడానికి పోలీస్ అధికారులు, సిబ్బందికి సాంకేతిక వ్యవస్థపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ అంశాలపై ప్రజలకు పోలీస్, షీ టీం కళా బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇన్‌స్పైర్ అవార్డులు

నారాయణపేట, ఫిబ్రవరి 6 : నారాయణపేట ఎమ్మార్సీలో మంగళవారం ఇన్‌స్పైర్ అవార్డుల కాంపిటేషన్ 2022-23 ఏడాదికి సంబంధించి ప్రాజెక్ట్‌లను మూల్యాంకనం చేయగా, రెండు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డీఈవో అబ్దుల్ ఘనీ తెలిపారు. జనవరి 1 నుంచి 3వ తేదీ వరకు గైడ్ టీచర్స్ ఆన్‌లైన్ ద్వారా 24 ప్రాజెక్టులను అప్‌లోడ్ చేశారు. కోకోనట్ ఫైబర్ పాట్స్ ఆల్టర్ నేటివ్ ఫర్ ప్లాస్టిక్ పాట్స్ అంశంపై టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ దామరగిద్దకు చెందిన శివారెడ్డి, గైడ్ జరీనా బేగం రూపొందించిన ప్రాజెక్ట్, ప్యాడి డ్రైయింగ్ కూల్ ప్రాజెక్టును జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ ధన్వాడకు చెందిన స్వాతి, గైడ్ శైలజ రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు. డీఎస్‌వో భానుప్రకాష్, నారాయణ గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

వడ్లు ఆరబోసే పరికరం..

వరి చేను కోశాక ధాన్యాన్ని నేరుగా ఆరబెట్టడడం వీలు కాదు. ధాన్యాన్ని రెండు మూడు రోజులు ఎండ బెట్టాల్సి ఉంటుంది. రైతు కుప్పగా పోసిన ధాన్యాన్ని పొద్దున్నే ఆరబెట్టడానికి కాళ్లతో దున్నుకుంటూ ఆరబెట్టాలి, రాత్రి మళ్లీ కుప్పగా పోసి వర్షపు నీటిలో తడవకుండా కవర్లు కప్పాలి. ఇలా నాగైదు రోజులు చేయడం రైతులకు ఇబ్బందిగా మారుతుంది. దాంతో వడ్లను ఆరబెట్టే యంత్రం సులభంగా ఉంటుంది.



వడ్లు ఆరబోసే పరికరంతో విద్యార్థిని స్వాతి

ప్లాస్టిక్ కుండీలకు ప్రత్యామ్నాయంగా కొబ్బరి పీచు కుండీలు

ప్లాస్టిక్ కుండీలు పర్యావరణానికి హానీ కల్గించడమే కాకుండా ప్లాస్టిక్ కుళ్లీ పోవడానికి ఏళ్ల సమయం పడుతుంది. ప్లాస్టిక్ కుండీలు కుళ్లీ పోయే సమయంలో విషపూరిత పదార్థాలు మట్టిలోకి విడుదలవుతాయి. ప్లాస్టిక్ కుండీలను కాల్చినపుడు విష వాయువు వెలువడుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి ప్లాస్టిక్ కుండీలకు బదులుగా కొబ్బరి పీచుతో సహజ సిద్ధంగా తయారు చేసిన కుండీలను ఉపయోగించం ద్వారా పర్యావరణానికి ఎలాంటి హానీ చేయకపోవడంతో పాటు నీటిని నిల్వుకునే సామర్థ్యం కుండీలకు ఉంటుంది. కుండీలు పలిగినప్పుడు పీచు కుండీలను మొక్కతో సహా భూమిలో పాతి పెట్టడడం వల్ల పర్యావరానికి హానీ జరుగదు.



కోకానట్ ఫైబర్ పాట్స్ ఆల్టర్ నేటివ్ ఫర్ ప్లాస్టిక్ పాట్స్ ప్రాజెక్టుతో విద్యార్థి శివారెడ్డి, గైడ్ జరినా బేగం

సమన్వయంతో పని చేయాలి

▸ రోడ్డు ప్రమాదాలను నివారించాలి

▸ కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఆర్టీవో అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రమాదాల జోన్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, మక్తల్, కృష్ణ రోడ్లపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటితో పాటు జాతీయ రహదారులకు ఆనుకొని ఉన్న గ్రామాల వద్ద ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంలో రోడ్డు ప్రమాద ప్రాంతాల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రోడ్డు భద్రత సామగ్రి, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, మైనర్ల డ్రైవింగ్‌ను కట్టడి చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ఏటా సంభవిస్తున్న మరణాల్లో రోడ్డు ప్రమాదాల మరణాలు ఎక్కువగా ఉంటున్నాయని వీటి సంఖ్య తగ్గాలంటే రోడ్డు భద్రతను ట్రాఫిక్ నియమాలను, వేగ నియంత్రణను ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. జిల్లాలోని పీఎస్‌ల పరిధిలో హాట్ స్పాట్ లోకేషన్లు 49 గుర్తించామన్నారు. జాతీయ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం కుదరదని, ఆయా రహదారులకు ఇరువైపులా ఉండే గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా కేంద్రంలో వాహనదారులు రాంగ్ రూట్‌లో వస్తున్నారని వారికి అవగాహన కల్పించాలని, గూడ్స్ వాహనాలు, ప్రయాణికుల రవాణాను అరికట్టాలని, బస్టాండ్ లోపలికి ప్రైవేటు వాహనాలు వస్తున్నాయని వాటిని అరికట్టడానికి పోలీస్, పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఎస్పీ కోరారు. బస్టాండ్ వద్ద సాయంత్రం వేళ ఈవ్ టీజింగ్ జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ పేర్కొంటూ ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతీ నెలా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని, జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్‌లో కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను పొందుపరచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డీఎస్పీలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఆర్టీవోలు మౌనిక గాంధీ, వీరస్వామి, ఆర్అండ్‌బీ రాములు, కమిషనర్ సునీత, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఏమీ చేసిందని కాంగ్రెస్ మంత్రులు ప్రశ్నిస్తున్నారని, కానీ విమర్శించే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కళ్లు తెరిస్తే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ హామీలు ఇవ్వకుండానే ప్రధాని మోదీ ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో భవ్య రామ మందిర నిర్మాణం, త్రిబుల్ తలాక్ లాంటి సమస్యలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాధించారన్నారు.

జిల్లా మార్పుపై ఇటీవల సోషల్ మీడియాలో, పత్రికల్లో ఊహాగానాలు వస్తున్నాయని, ఏ మాత్రం జిల్లాను మార్చే చర్యకు పూను కుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. జిల్లాను సస్యశ్యామలం చేసే జీవో 69 అమలు చేసి, పేట - కొడంగల్ ఎత్తిపోతలను పూర్తిచేసి చిత్తశుద్ధి చాటుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘురామయ్య, సిద్ది వెంకట్రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

మరికల్, ఫిబ్రవరి 6 : మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్ఐ మురళి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం, మరికల్ వికాస వేదిక ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చౌరస్తాలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. నెహ్రూ యువక కేంద్రం, వికాస వేదిక ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో వికాస వేదిక కన్వీనర్ అంజనేయులు, సభ్యులు రాజశేఖర్, అశోక్, శివరాజ్, పవన్, రవి, భాను, నాగరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నారాయణపేట, ఫిబ్రవరి 6 : తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్ సెంట్రల్ ఫోరమ్ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ అజీమ్, ఉపాధ్యక్షుడు శంకర్, కోశాధికారి తిరుమలేష్, రాజా నాయక్, శ్రీనివాస్, రవితేజ, లక్ష్మీ నరసింహ, సంతోషి పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

ధన్వాడ, ఫిబ్రవరి 6 : ధన్వాడ ఎస్ఐగా పనిచేసిన రమేష్ ఇటీవల మహబూబ్‌నగర్‌కు బదిలీ కావడంతో మంగళవారం ధన్వాడలో వివిధ పార్టీల నాయకులు, పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్లిన ఎస్ఐతో పాటుగా నూతనంగా వచ్చిన ఎస్ఐ రమేష్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 6 : ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ సెలక్షన్‌లో రాష్ట్ర స్థాయికి పేట శ్రీసాయి జూనియర్ కళాశాల విద్యార్థి మహేష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ రామ కృష్ణ, డీఐఈవో సుదర్శన్‌రావు, డీఈసీ విజయలక్ష్మి విద్యార్థిని అభినందించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

ధన్వాడ, ఫిబ్రవరి 6 : రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఎస్ఐ రమేష్ అన్నారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారులు ఎంపిక జరిగింది. ప్రభుత్వం క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తోందన్నారు. అనంతరం బహుమతులు అందించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, నర్సింహులు, ఇన్‌చార్జి బసన్న, పీఈటీ కిరణ్, సాయినాథ్, అనంతసేన, కోచర్ శ్రీనివాస్, మోహన్, భీమన్న పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

నారాయణపేట వైద్యవిభాగం, ఫిబ్రవరి 6 : 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని డీఎంహెచ్‌వో డా.సౌభాగ్యలక్ష్మి అన్నారు. ఈనెల 12న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా కోటకొండ పీహెచ్‌సీలో డాక్టర్ నర్సింహారావు ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డా.సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2 నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 19 ఏళ్ల పిల్లలకు ఒక మాత్ర వేయడం జరుగుతుందన్నారు.

పందులోని కుంట సర్వే

కోస్గి రూరల్, ఫిబ్రవరి 6 : గుండుమల్ మండలంలో పందులోని కుంట కనుమరుగైంది. మండలంలోని భోగారం గ్రామ శివారులోని 117 సర్వే నెంబర్‌లో పందుల కుంట ఉండేదని ఆ కుంట కనుమరుగైందని సమాచారం అందడంతో ఇరిగేషన్ అధికారులు మంగళవారం సర్వే చేశారు. ఇక్కడ పందులోని కుంట ఉందని, దీన్ని ఆక్రమించుకుంటే ఊరుకోబోమన్నారు. ఈ భూమి భోగారం గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఎంపీటీసీది కావడంతో అధికారులు తమ భూమికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని కోరారు. రెండు రోజుల్లో సరైన పత్రాలు ఇవ్వకుంటే ఊరుకునేద లేదని హెచ్చరించా రు. ఇరిగేషన్ డీఈ ఆనంద్‌కిషోర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

కొనసాగిన ధాన్యం విక్రయాలు

నారాయణపేట, ఫిబ్రవరి 6 : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ధాన్యం విక్రయాలు జోరుగా కొనసాగాయి. వేరు శనగలు 2,057 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,819, కనిష్ఠంగా రూ.3,669, రమారమిగా రూ.6,209 పలికింది. శనగలు ఐదు క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.6,109, కనిష్ఠంగా రూ.5,809, రమారమిగా రూ.6,109, పెసర్లు క్వింటాలు రాగా గరిష్ఠ, కనిష్ఠంగా రూ.6,209, ఉలవలు నాలుగు క్వింటాళ్లు విక్రయానికి రాగా గరిష్ఠ, కనిష్ఠంగా రూ.6,700, ఎర్ర కందులు 148 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.11,009, కనిష్ఠంగా రూ.10,309, రమారమిగా రూ.10,509, తెల్ల కందులు 26 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.11,111, కనిష్ఠంగా రూ.10,769 పలికింది.

'డీఎస్పీ, సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

మరికల్, ఫిబ్రవరి 6 : డీఎస్పీ, సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇథనాల్ కంపెనీ వ్యతిరేఖ పోరాట కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం కంపెనీ వ్యతిరేఖ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని సెక్రెటరీ కార్యాలయంలో వితని పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరికల్ మండలం చిత్తనూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని రెండు సంవత్సరాలుగా శాంతియుతంగా రైతులు, ప్రజలు పోరాడుతుంటే డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాజేందర్, అప్పటి ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇథనాల్ కంపెనీని మూసివేసి, లాఠీ చార్జికి బాధ్యులైన పోలీసులను శిక్షించాలన్నారు. భాగ్యస్వామ్య సంఘాల ప్రతినిధులు రాఘవాచారి, వెంకట్రాములు, యాదగిరి, చంద్రశేఖర్, లక్ష్మయ్య, రామారావు పాల్గొన్నారు.

సరాఫ్ కృష్ణకు ప్రముఖుల నివాళి

నారాయణపేట, ఫిబ్రవరి 6 : నారాయణపేటకు చెందిన ప్రముఖ రాజకీయ, వ్యాపార వేత్త సరాఫ్ కృష్ణ (82) మృతి చెందడడంతో మంగళవారం ప్రముఖులు పార్థివ దేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళి అర్పించారు. నారాయణపేట నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో 2014, 2019లో రెండు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమి చవి చూశారు. దివంగత మాజీ ఎంపీ జైపాల్‌రెడ్డి శిష్యుడిగా సరాఫ్ కృష్ణ కొనసాగారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికా రెడ్డి, వాకిటి శ్రీహరి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, సత్య యాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, సంజీవ్, సూగప్ప, యానగుంది దత్తాత్రేయ ఆలయ ట్రస్ట్ కార్యదర్శి కృష్ణ కోర్వార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, అఖిల పక్షం నాయకులు గందె చంద్రకాంత్, కన్న జగదీశ్, విజయ్‌సాగర్, బండి వేణుగోపాల్, శశికాంత్, కెంచి నారాయణ నివాళి అర్పించారు. బులియన్ మర్చంట్ గౌరవ అధ్యక్షుడు కావడంతో ఆయన మృతికి సంఘీభావంగా సరాఫ్ బజార్‌లో బంగారు, వెండి దుకాణాలను మూసివేసి వ్యాపారులు నివాళి అర్పించారు.

● ధన్వాడ : మండల కేంద్రంలో మంగళవారం వివిధ పార్టీల నాయకులు సరాఫ్ కృష్ణకు నివాళి అర్పించారు. నీరటి నర్సిములు నాయుడు ముదిరాజ్. నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, కెంచె రఘువీర్, జుట్రం లక్ష్మయ్యగౌడ్, కెంచె నరేందర్, ఓగ్గు వెంకట్రాములు, నీరటి నారా యణ, శివరాములు, సంద చిన్న బాల్‌నర్సిములు పాల్గొన్నారు.